క్లుప్తంగా

యువతి అదృశ్యం.. కేసు నమోదు



రాజోళి: మండల కేంద్రంలో యువతి అదృశ్యమైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగదీశ్ తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన తెలుగు రామాంజనేయులుకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం రామాంజనేయులు కుమార్తె అశ్విని(19) కిరాణ దుకాణానికి వెళ్తున్నానని చెప్పి ఎంతకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



అలంపూర్: కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా వచ్చిన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే విజయుడు బుధవారం అందజేశారు. వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన నాయక బీచుపల్లి వైద్య చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.3.20 లక్షలు విలువైన ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు అందజేశారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అయిజ: మండలంలోని వెంకటాపురంలో 12 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న ఒంటరి మహిళ మల్లమ్మ (55) బుధవారం ఆమె గుడారంలో పాముకాటుకు గురై మృతి చెందింది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి స్వాతి, గ్రామ ప్రజలు ఆమె మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

మోటార్ రాగితీగలు చోరీ

రాజోళి: మండలంలోని పచ్చర్ల గ్రామంలో వ్యవసాయ పొలంలో ఉన్న రాగి తీగలు చోరీకి గురయ్యాయి. బుధవారం ఎస్‌ఐ జగదీష్ తెలిపిన వివరాలు.. మండలంలోని పచ్చర్ల గ్రామానికి చెందిన పరమేష్‌నాయుడు పొలంలో ఉన్న బోరు మోటార్‌లోని రాగి తీగలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించగా, బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.


నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు చేపట్టిన పనుల్లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని పర్దిపురంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నరేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని పేర్కొన్నారు.

రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

అయిజ: ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి కలిగిన రైతులు ఆయా గ్రామాలకు సంబంధించిన వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద తమ పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి జనార్దన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆవులు, ఎద్దులు, గేదెలు ఉన్న రైతులు మాత్రమే అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీలతోపాటు మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ



రాజోళి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ కొనసాగుతుంది. పనులపై పూర్తి వివరాలను సోషల్ ఆడిట్ సిబ్బంది విచారణ చేపట్టారు. ఈ మేరకు ముండ్లదిన్నె గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. పచ్చర్ల, పెద్ద తాండ్రపాడు, తూర్పు గార్లపాడు, రాజోళి, చిన్నధన్వాడలో ఆడిట్ నిర్వహించారు. చేపట్టిన పనులు, మెటీరియల్, కూలీల వేతనాలకు సంబంధించిన వివరాలు నమోదు చేశారు. కార్యక్రమంలో ఆడిట్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- ఇళ్లపై విద్యుత్ లైన్లు
- రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు
- ఒరిగిన విద్యుత్ స్తంభాలు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు



మానవపాడు ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మానవపాడు: అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు నిలుస్తున్నాయి. ఇళ్ల పైనుంచి వెళ్తున్న విద్యుత్ వైర్లు, రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు, ఒరిగిన విద్యుత్ స్తంభాలతో ప్రమాదం పొంచి ఉన్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు..

మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఏ గ్రామంలో చూసినా కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు దర్శనమిస్తున్నాయి. తరచూ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయ ఉపాధిని కోల్పోయి దిక్కుతోచని స్థితిలో పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నివాస గృహాల మధ్య..

మండలంలోని చెన్నిపాడు గ్రామంలో పాఠశాలకు వెళ్లే దారి, కొత్త ఎస్సీ కాలనీలో నివాస గృహాల మధ్య, మానవపాడులో గాంధీచౌక్ చౌరస్తా వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు, ఇళ్లపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ లైన్ల విషయమై చెన్నిపాడు గ్రామస్తులు జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే అబ్రహం సర్వసభ్య సమావేశంలో విద్యుత్ అధికారులతో మాట్లాడి తొలగించాలని ఆదేశాలు చేసి ఇంత వరకు తొలగించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. అదే విధంగా మండలంలోని ఆయా గ్రామాల్లో రోడ్డుపై కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు, ఇళ్లపై విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు భయాందోళనలో ఉన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చెన్నిపాడులో ఇంటిపై వెళ్లిన ప్రధాన విద్యుత్ వైర్లు



చెన్నిపాడులో ఇంటిపై వరిగిన విద్యుత్ స్తంభం

విద్యుత్ తీగలు తొలగించాలి



చెన్నిపాడులో నివాస గృహాలపై తీగలు వెళ్తున్నాయి. పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. అదే విధంగా పాఠశాలకు వెళ్లే దారిలో ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– శేఖర్, చెన్నిపాడు

భయంగా ఉంది



మండల కేంద్రంలోని ప్రధాన రహదారి గుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రక్షణ కంచె లేక ప్రమాద భరితంగా ఉంది. ప్రతి నిత్యం విద్యార్థులు, వాహనదారులు తిరుగుతుంటారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేక పోవడంతో విద్యుత్ ప్రమాదంలో మూగజీవాలు మృతి చెందాయి.

– శ్రీకాంత్‌రెడ్డి, మానవపాడు

రక్షణ లేనివాటిని గుర్తిస్తాం..

మండలంలో ప్రమాదభరితంగా ఉన్న వాటిని గుర్తిస్తాం. పాఠశాలల ప్రజలు రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేస్తాం. ప్రమాదకర విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. చెన్నిపాడులోని నివాసగృహాలపై విద్యుత్ తీగలను పరిశీలించి త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.

– సుబ్బారాయుడు విద్యుత్ ఏఈ, మానవపాడు

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

అయిజ: ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కార్తీక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సార్వత్రిక సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ప్రతి కార్మికుడు తప్పనిసరిగా సమ్మెలో పాల్గొన్నాలని కోరారు. కార్యక్రమంలో హనుక్, ఆదాం, సామేలు, మహేష్, యేసన్న, యోబు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో పోలీసులు బుధవారం డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఎస్‌ఐ నాగశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీపై రెడ్ బ్యాండ్ ఏర్పాటు

ధరూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై రెడ్ బ్యాండ్ ఏర్పాటు చేసినట్లు హెల్త్ సూపర్‌వైజర్ హీర్యానాయక్ తెలిపారు. ఆరోగ్య శాఖ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశానుసారం పీహెచ్‌సీ భవనంపై డాక్టర్ ఖురేషి ఆయేషాబేగం ఆధ్వర్యంలో 12 అగుగుల వెడల్పుతో రెడ్ బ్యాండ్ ఏర్పాటు చేశామన్నారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో హెలికాప్టర్, విమానల నుంచి క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రెడ్ బ్యాండ్ గుర్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య కేంద్రంపై వేసిన రెండ్ బ్యాండ్ చిహ్నం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు సర్వే



గట్టు: మండల పరిధిలోని పెంచికలపాడులో ఇందిరమ్మ ఇళ్ల అర్హుల గుర్తింపు సర్వే కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీడీఓ చెన్నయ్య తెలిపారు. ఇంటింటికి తిరిగి అర్హులను గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫిరోజ్, సీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలి

రాజోళి: మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించాలని పీఏసీఎస్ సీఈఓ రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజోళి, మాన్‌దొడ్డి, తుమ్మిళ్లలో జొన్నలు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీల ద్వారా తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రాల్లో సంచుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామని, రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'భూ భారతి'తో భూసమస్యల పరిష్కారం



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసరావు

ఇటిక్యాల: భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆర్డీఓ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని చాగాపురంలో నిర్వహించిన భూ భారతి సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలను నేరుగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూరికార్డుల నిర్వహణలో పారదర్శకత, భూ సమస్యల పరిష్కారం కోసం ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. ఈ మేరకు పైలెట్ ప్రాజెక్టుగా ఇటిక్యాల మండలాన్ని ఎంపిక చేసి ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, రైతుల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని వివరించారు. భూ రికార్డుల సవరణలు, విస్తీర్ణ మార్పులు, వారసత్వ సమస్యలు, భూమి స్వభావానికి సంబంధించిన లోపాలు, నిషేధిత జాబితాలో ఉన్న భూములు, సాదాబైనామాలు, సర్వే నెంబర్ గల్లంతు, పట్టాదారు పాస్‌బుక్‌జారీ కాకపోవడం వంటి అంశాలు పరిష్కరించబడతాయని తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఉచితమని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సులో తహశీల్దార్లు వీరభద్రప్ప, నరేష్, డీటీ నందిని, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలు

గద్వాల: కొండాలక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో మూడేళ్ల డిప్లొమా కోర్సు ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు చేనేత మరియు జౌళిశాఖ సహాయ ఏడీ గోవిందయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు 60 శాతం సీట్లు కేటాయించారని, పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు దరఖాస్తులను ఈనెల 25వ తేదీ వరకు tsht.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాలపై అవగాహన కల్పించేందుకు ఈనెల 16వ తేదీన ఉదయం 10.30గంటలకు గద్వాల పట్టణం వేదనగర్‌లోని శ్రీభగవాన్ జీవేశ్వర ఆలయం వద్ద కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి ప్రత్యేక అధికారి రతన్‌కుమార్ రానున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ 10వ తరగతి మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్స్, రెండుపాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో పాటు దరఖాస్తు ఫారంతో హాజరు కావాలని సూచించారు.

సమన్వయంతో ఉర్సు నిర్వహించాలి

అలంపూర్: ఉర్సును అన్ని శాఖల అధికారులు సమన్వయంతో నిర్వహించాలని ఆర్డీఓ శ్రీనివాసరావు అన్నారు. అలంపూర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో షా–అలీ–పహిల్వాన్ ఉర్సు నిర్వహణపై బుధవారం ఆర్డీఓ.. మండలంలోని ఆయా శాఖల అధికారులు, దర్గా డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ నెల 20వ తేదీ నుంచి 23వ తేది వరకు షా–అలీ–పహిల్వాన్ ఉర్సు ఉత్సవాలు జరగనున్నట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ రాత్రి గంధోత్సవం, 21న సర్ ముభారక్ దర్గాలో చిన్న కిస్తీలు, 22న ధడ్ ముభారక్ దర్గాలో పెద్ద కిస్తీ పోటీలు, 23న మహిళలకు ప్రత్యేక ఉర్సు ఉంటుందని తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపాలిటీ అధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం, తాగునీటి వసతి, వైద్య సేవలు, నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, పోలీసులు భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో సీఐ రవిబాబు, తహశీల్దార్ మంజుల ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో లో ఓల్టేజీకి చెక్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎండా కాలంలో జిల్లా కేంద్రంలో లో ఓల్టేజీ సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్‌శాఖ పట్టణ ఏడీ తవుర్యనాయక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా తీవ్రమైన లో ఓల్టేజీ సమస్య ఉండేదని తెలిపారు. దీంతో లక్ష్మీనగర్ కాలనీ వాసులు సమస్యను ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు వెంటనే ట్రాన్స్‌ఫార్మను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో ఆ ప్రాంతంలో ఎలాంటి లోఓల్టేజీ సమస్య లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో ఏఈ అరుణ్‌కుమార్, కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

మల్దకల్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మహిళా సాధికారత అధికారి సరోజ అన్నారు. బుధవారం మండలంలోని సద్దలోనిపల్లి గ్రామంలో ఉపాధి కూలీలకు బేటీ బచావో..బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆడపిల్లల చదువు భవిష్యత్తుకు వెలుగని, తల్లిదండ్రులు ముఖ్యంగా తమ ఇంట్లోని ఆడపిల్లలను చదివించాలని సూచించారు. ఆడపిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా వారి బంగారు భవిష్యత్‌కు నాంది పలుకుతుందన్నారు. బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, మహిళా అక్రమ రవాణా వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో మహిళలు 1098, 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కళావతి, చిట్టెమ్మ, ప్రకాష్, లావణ్య, పంచాయతీ కార్యదర్శి రేణుక, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



సద్దలోనిపల్లిలో అవగాహన కల్పిస్తున్న జిల్లా మహిళా సాధికారత అధికారి సరోజ

పచ్చిరొట్టె ఎరువుతో మట్టిలో పోషకాలు

కేటీదొడ్డి: పచ్చిరొట్టె ఎరువుల వల్ల మట్టిలో పోషకాలు పెరగడంతో పాటు నీటి పట్టుతత్వం మెరుగవుతుందని మండల వ్యవసాయ అధికారి సాజీద్ రెహమాన్ అన్నారు. బుధవారం మండలంలోని చింతలకుంట గ్రామంలో రైతు వేదికలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచూపాలన్నారు. పచ్చిరొట్టె ఎరువుల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. అదే విధంగా సేంద్రియ సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సాజిద్‌రెహమాన్

ఉత్సాహంగా ఎద్దుల బండలాగుడు పోటీలు



ఉండవెల్లిలో బండలాగుతున్న ఎద్దులు



తక్కశీలలో హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ఉండవెల్లి: మండల కేంద్రం, తక్కశీల గ్రామాల్లో బుధవారం ఈదమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఎద్దుల బండలాగుడు పోటీలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో 16 జతల ఎద్దులు పోటీలో పాల్గొన్నాయి. వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన డీసీఎస్ఆర్ బుల్స్ విజేతగా నిలిచాయి. మొదటి బహుమతి ఉండవెల్లి రెడ్ల సంఘం సభ్యులు రూ.55 వేలు, రెండో బహుమతి కర్నూల్ జిల్లాకు చెందిన వరలక్ష్మీకి చెందిన ఎద్దులు నిలవగా నూర్ ట్రేడర్స్, సుగుణ ఐరన్ ఏజెన్సీస్ రూ.50 వేలు అందజేశారు. తక్కశీలలో 9 జతల ఎద్దులు పోటీలో పాల్గొనగా మొదటి బహుమతి నాగర్‌కర్నూల్ జిల్లాకు చంద్రకల్ గ్రామానికి చెందిన ఎద్దులు రూ.50 వేలు గెలుపొందాయి. కార్యక్రమంలో రైతు సంఘం సభ్యులు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

నిజమైన అర్హులను ఎంపిక చేయండి

అయిజ: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు, కార్యర్తలకు సంబంధించిన వారికే ఎక్కువ శాతం ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో, మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో ఉరుకుందు, రాజు, తిమ్మప్ప, కృష్టారెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న పల్లయ్య

ఘనంగా కర్రెమ్మ, మాశమ్మవ్వ ఉత్సవాలు



కేటీదొడ్డిలో కర్రెమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని కర్రెమ్మ, మాశమ్మ ఆలయాల్లో ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు పొట్టేళ్లను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో బీఆర్ఎస్ నాయకులు బాసుహనుమంతునాయుడు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని చండూరు గ్రామంలో బుధవారం పెద్దమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కలు చెల్లించారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



కేటీదొడ్డిలో కర్రెమ్మ ఆలయానికి బోనంతో తరలివెళ్తున్న భక్తులు

ప్లాస్టిక్ వినియోగంపై మినహాయింపు ఇవ్వాలి

అయిజ: మున్సిపాలిటీలో కిరాణ దుకాణాల్లో ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణలో మినహాయింపు ఇవ్వాలని కిరాణం దుకాణాల యజమానులు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సీహెచ్ సైదులును కలిసి మున్సిపాలిటీలో ప్లాస్టిక్ వినియోగంపై ఆంక్షలు తొలగించాలని కోరారు. నిబంధనల ప్రకారం 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వస్తువులు ఉపయోగించరాదని, పాలతిన్ కవర్లకు బదులు ఇతర సంచులు ఉపయోగించాలని కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమీషనర్, కిరాణం దుకాణాల యజమానులకు వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రస్తుతం పెళ్లిల్లు, గ్రామ దేవతల ఉత్సవాలు నిర్వహిస్తున్నారని ఉత్సవాలు ముగిసే వరకు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, విస్తర్లు తదితర వస్తువుల విక్రయాలకు అనుమతి ఇవ్వాలని కోరారు. జాతర్లకు ఉత్సవాలకు విరాళాలు ఇస్తున్నామని, అదే విధంగా వివిధ ప్రభుత్వ శాఖలకు విరాళాలు ఇచ్చామని దీంతో ప్లాస్టిక్ వినియోగానికి అనుమతించాలని కోరడం విశేషం. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడారు. ఉన్నతాధికారులతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని దుకాణ యజమానులతో పేర్కొన్నారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న వ్యాపారులు

పన్ను చెల్లింపులో నిర్లక్ష్యం తగదు

గోపాల్‌పేట: వాహనాలపై ఉండే పన్నులు ఎప్పటికప్పుడు కట్టి ప్రభుత్వానికి సహకరించాలని వనపర్తి మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ మానస సూచించారు. బుధవారం ఆమె మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాలపై ఉండే ట్యాక్స్‌లు ఎప్పటికప్పుడు కట్టాలని, లేదంటే జరిమానాలు పెద్ద మొత్తంలో ఉంటాయని అవగాహన కల్పించారు. ట్యాక్స్‌లు సరిగా కట్టని హార్వేస్టర్, నాలుగు ట్రాక్టర్లు, రెండు ఆటోలను సేఫ్ కస్టడీ కోసం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు.